క్లుప్తంగా

సంత వేలం పాట వాయిదా

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట, రోలుగుంట సంత వేలం పాటలు ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసినట్టు ఎంపీడీవో ప్రభాకర రావు తెలిపారు. ఈ గ్రామాల్లో ఈ నెల 24న వేలం నిర్వహించాల్సి ఉండగా, పాటదారులు హాజరు కాకపోవడంతో వాయిదా వేశామన్నారు. పాటలో పాల్గొనేవారు రోలుగుంట సంతపాటకు రూ.25 వేలు, బుచ్చింపేట సంతకు సంబంధించి రూ.15 వేలు ధరావతు కట్టాలని, రూ.50 వేల సాల్వెన్సీ ధ్రువపత్రంతో పాల్గొనాలని సూచించారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

మాడుగుల రూరల్: స్థానిక మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం స్థానికులు ఒడ్డు పండగ నిర్వహించారు. గ్రామానికి చెందిన ధనుస్సు కుటుంబ సభ్యులు 101 ఘటాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడ్డు పండగలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ఘనంగా అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న గ్రామ పెద్దలు

కె.కోటపాడు: చౌడువాడలో మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజేతలైన ఎడ్ల యజమానులకు నగదు పురస్కారాన్ని అందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



నంద కిషోర్

కె.కోటపాడు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన రెడ్డి నందకిషోర్ ఎంపికయ్యాడు. ఈ విద్యార్థికి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం అందనుందని ప్రధానోపాధ్యాయిని అనురాధ తెలిపారు. ఆమెతోపాటు ఉపాధ్యాయులు ఎరుకునాయుడు, అమృతరావు అభినందించారు.

390 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న శంకరరావు

కె.కోటపాడు: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా టీకాలను వేయించాలని ఎంపీటీసీ లెక్కల శంకరరావు అన్నారు. మంగళవారం ఎ.కోడూరు ఆర్బీకే పరిధి పాడుగుపాలెంలో 390 పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ వేశారు. ఈ టీకాలను వేసే కార్యక్రమాన్ని ఎంపీటీసీ పర్యవేక్షించారు.

4న జిల్లా స్థాయి బైటో భజన పోటీలు

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ వద్ద బాలాంజనేయ స్వామి తీర్థం వచ్చే నెల 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జిల్లా స్థాయి బైటో భజన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.12,116, రూ.8,116, రూ.6,116 అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఒక్కొక్క బృందం రూ.200 చొప్పున నామినేషన్ ఫీజు వచ్చే నెల 3వ తేదీ లోపున చెల్లించాలన్నారు. 7036018164, 9705342365 పూర్తి సమాచారం పొందాలన్నారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

నర్సీపట్నం: నర్సీపట్నం పురపాలక కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని కమిషనర్ కె.కనకారావు తెలిపారు. సమావేశంలో ఎజెండాలోని అంశాలను చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మాకవరపాలెం: సమావేశానికి వేలాదిగా హాజరైన డ్వాక్రా మహిళలు



మండల పరిషత్ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి ఎంపీపీతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం నర్సీపట్నం మండల పరిషత్, మున్సిపాలిటీలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం గావించారు. గ్రామాలు, వార్డుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పొదుపు సంఘాల మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పథకం ద్వారా నియోజకవర్గంలో 56 వేల మంది డ్వాక్రా మహిళలకు రూ.40 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. మూడో విడతలో నర్సీపట్నం రూరల్ మండలం, మున్సిపాలిటీలో 17 వేల మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.13 కోట్లు రుణమాఫీ అయిందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎవరిది విశ్వసనీయతో తెలుసుకోవాలని మహిళలకు సూచించారు. ఎన్నికల నాటికి నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలు రూ.160 కోట్లు బ్యాంకుల్లో అప్పు ఉండేదన్నారు. మూడు విడతలుగా ఆసరా పథకం కింద రూ.120 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, కోనేటి రామకృష్ణ, జగదీశ్వరి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, మెప్మా పీడీ సరోజిని, వైస్ ఎంపీపీ తాతబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యానాయుడు, సచివాలయ కన్వీనర్లు తమరాన శ్రీనివాసు, శానాపతి వెంకటరత్నం, ఎంపీడీవో జయమాధవి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసు, కోఆప్షన్ సభ్యులు స్వామి, రోజా, వెలుగు ఏపీఎం పార్వతి, మెప్మా కోఆర్డినేటర్ రవి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాకవరపాలెం: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాలు నిర్వహించారు. సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి, మహిళలకు ఆసరా నగదు నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడో విడతగా 13,597 మంది మహిళలకు రూ.9.26 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను గమనించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆడపడుచులంతా ఆశీర్వదించాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీడీవో అరుణశ్రీ, పార్టీ నేతలు హరిబాబు, భద్రాచలం, గోవిందరావు, చిటికెల రమణ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ వుమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, జెడ్పీటీసీ సత్యవేణి, వైస్ ఎంపీపీ రాజారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాసపు నాగేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాదరావు, వెలుగు ఏపీఎం చినబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అధిక పోషక విలువలు



మాట్లాడుతున్న పీవో మంగతాయారు



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: గర్భిణులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధతో పౌష్టికాహారం తీసుకోవాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సూచించారు. పోషణ్ పక్వాడాలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వివిధ రకాల పిండివంటలు, చిరుధాన్యాలతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిని సందర్శించిన ఎమ్మెల్యే వంటకాలను రుచిచూశారు. ఐసీడీఎస్ సీడీపీవో మేరీ, సూపర్‌వైజర్ సత్యవతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మినరల్ వాటర్

నాతవరం: ప్రభుత్వం కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలకు మినరల్ వాటర్ సదుపాయం కల్పిస్తుందని కోటవురట్ల ఐసీడీఎస్ పీవో కె. శ్రీగౌరి తెలిపారు. పోషణ్‌పక్వాడాలో భాగంగా మంగళవారం డి.యర్రవరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మొదట విడతలో కొన్ని కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. మిగతా కేంద్రాలకు త్వరలో వస్తాయన్నారు. నాతవరం, వై.డి.పేట సెక్టారు సూపర్‌వైజర్లు ఎ.విజయలక్ష్మి, ఎ.నాగజ్యోతి, ప్రాజెక్టు కార్యాలయాధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధికంగా పోషక విలువలు ఉండనున్నట్లు స్థానిక ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం చౌడువాడలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏహెచ్‌కె.ఈశ్వరమ్మ, మంగవేణి, సత్య, పరమేశ్వరి, జగది, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన గ్రామం తామరబ్బలో...

దేవరాపల్లి: పోషణ పక్వాడాలో భాగంగా మంగళవారం గిరిజన గ్రామం తామరబ్బలో అంగన్‌వాడీ సిబ్బంది చిరుధాన్యాలతో తయారీ చేసిన వంటకాల స్టాళ్లను ప్రదర్శించారు. సర్పంచ్ టోకురి రామకృష్ణ వీటిని సందర్శించి రుచి చూశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. రాములమ్మ, పంచాయతీ సెక్రటరీ ఎల్.లింగన్న, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, గుమ్మడపు మహేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మాడుగుల రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో బి. దేముడమ్మ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలకు మండలంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసామని, 733 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. తాటిపర్తి గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాల, మాడుగుల ఆర్సీఎం, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కె.జె.పురం జెడ్పీ హైస్కూలు, ఒమ్మలి జెడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించినట్టు, పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ నెల 3న తెలుగు, 6న హిందీ, 8న ఇంగ్లిషు, 10న గణితం, 13న సైన్స్, 15న సోషల్ పరీక్షతో ముగిస్తాయన్నారు.

రీ సర్వేతో రైతులకు మేలు



రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

గొలుగొండ: సమగ్ర రీ సర్వే వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. పుత్తడిగైరంపేట రెవెన్యూ పరిధిలో సమగ్ర రీసర్వే విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. డివిజన్‌లో ఇప్పటికే రీసర్వే పనులు చురుగ్గా సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమగ్ర రీసర్వే వల్ల దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమగ్ర రీ సర్వే సమయంలో రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని సూచించారు. తహసీల్దార్ ఆనందరావు, సర్వేయర్ చినబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన లావణ్యను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు



రోలుగుంట: పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు, హెచ్ఎం అచ్చుతం

నాతవరం: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స అన్నారు. స్థానిక హైస్కూల్ వార్షికోత్సవంతోపాటు పది విద్యార్థులకు వీడ్కోలు వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన చిటికెల లావణ్యను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఎంఈవో తాడి అమృత్‌కుమార్, సర్పంచ్ గొల గాని రాణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పైల రామలక్ష్మి, మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వార్డెన్లు రొంగలి శివ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ నాయకులు కాపారపు వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రోలుగుంట: కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అచ్చుతం మాట్లాడుతూ పరీక్షలపై విద్యార్థులు ఏకాగ్రత చూపించి శత శాతం ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి విదార్థులకు సర్పంచ్ మద్దు అప్పలనాయుడు సమకూర్చిన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థుల నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రూ.2 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు



భూమిపూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

రావికమతం: స్థానిక శ్మశానవాటికలో అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గెంజి మంగమోదినాయు డు, ఎంపీటీసీ వేపాడ లక్ష్మి భూమి పూజ చేశారు. దహన క్రియల నిమిత్తం ఇక్కడికి వచ్చే ప్రజలు స్నానమాచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ నిధులు రూ.2 లక్షలతో కుళాయి పైపులైన్‌లు వేసి ఒకే సారి ఎక్కువమంది స్నానమాచరించేలా పనులు చేస్తామన్నారు.

రూ.కోటితో అంతర్గత సీసీ రోడ్లు



దేవరాపల్లి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో దేవరాపల్లి రూపురేఖలు మారుతున్నాయి. ఇప్పటికే కోట్లాది రూపాయలతో పలు గ్రామాలను అనుసంధానించే రహదార్లను తారురోడ్లుగాను, సీసీరోడ్లుగా నిర్మించారు. తాజాగా అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి నేతృత్వంలో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొల్లూరి వారి వీధి, ఆంధ్ర వీధి సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, కుమ్మరి వీధి, గుమ్మడి వీధి, మొండి వీధి, గాంధీ వీధి, రామాలయం డౌన్ వీధి, బీరక వీధి సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్ల నిర్మాణ పనులు ఎంపీపీ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. నాలుగురోడ్ల కూడలిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి కొబ్బరి తోట వరకు డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు రూ.40 లక్షలతోను, దేవరాపల్లి-తెనుగుపూడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బంగారమ్మపాలెంకు డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు రూ.20 లక్షలతోను ఇప్పటికే ప్రతిపాదనలు చేశారు. దేవరాపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కొరుపోలు వారి వీధికి రూ.20 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం

దేవరాపల్లి: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఏపీ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ యజ్జల బాలరాజు, ప్రధాన కార్యదర్శి వానాల డేవిడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ చారిత్రక బిల్లు ప్రవేశపెట్టిన సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనకాపల్లి జిల్లా సెంట్రల్ కమిటీ సభ్యుడు బిషప్ బి. సాల్మన్‌రాజు, యేసురాజు, యోహాను, డానియల్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

మాకవరపాలెం: జి.కోడూరుకు చెందిన దివ్యాంగుడు మామిడి గోవిందకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు కర్రి సురేష్ పాల్గొన్నారు.

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



అనురాధను సన్మానిస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్

మాడుగుల: పట్టణంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధను మంగళవారం తూర్పుకాపు సంక్షేమ సంఘం డైరెక్టరు గొల్లవిల్లి ప్రభావతి, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషాబేగం, సర్పంచ్ ఎడ్ల కళావతి, వార్డు మెంబర్లు శీలామంతుల జ్యోతి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అధికంగా మహిళలు పాల్గొన్నారు.

రూ.8.73 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు



నిధుల వివరాలను తెలుపుతున్న ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.8.73 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. కె.కోటపాడులో వారు మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో 18 గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.4.10 కోట్లు, పిండ్రంగి నుంచి కొత్తభూమి వరకు మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు పనులకు రూ.2 కోట్లు, గొండుపాలెం నుంచి మురుగుపాలెం వరకు మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, పిండ్రంగి నుంచి డి.అగ్రహారం జంక్షన్ వరకు కిలోమీటరు మేర తారురోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.63 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, వేచలపు దొరబాబు, ఆదిరెడ్డి సన్యాసినాయుడు, వర్రి రామునాయుడు, చీపురపల్లి అచ్చిబాబు, ఏటుకూరి రాజేష్, బోళెం కృష్ణారావు, బండారు ముత్యాలనాయుడు, దేముళ్లు, రామస్వామిపాత్రుడు, లెక్కల శంకరరావు, ఆదిరెడ్డి రామునాయుడు, జాగరపు వెంకట రామలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎంపీపీ నాగేశ్వరిదేవి

బుచ్చెయ్యపేట: ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం సహాయనిధితో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తెలిపారు. తురకలపూడికి చెందిన లారీ డ్రైవర్ నానిపల్లి వెంకటప్రసాద్ ఇటీవల అనకాపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి శస్త్రచికిత్స నిమిత్తం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేశారు. వెంకట ప్రసాద్ వైద్య సేవల ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం ఎంపీపీ నాగేశ్వరిదేవి, సర్పంచ్‌లు యర్రంశెట్టి గోవింద, మరిసా నాని, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, గ్రామ నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, బుదిరెడ్డి నాగభూషణం, గంట్ల రామునాయుడు, వెంకటరమణ, చిన్నంనాయుడు, మంత్రి నానాజీ తదితర్ల సమక్షంలో బాధితుడికి చెక్కు అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి



ఎ.కోడూరులో రైతులకు వివరిస్తున్న ముత్యాలనాయుడు

కె.కోటపాడు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వచ్చే నెల 5న ఢిల్లీలో కర్షక పోరాట ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి ఆర్. ముత్యాలనాయుడు తెలిపారు. ఎ.కోడూరులో రైతులను ఆయన మంగళవారం కలిసి కర్షక పోరాట ప్రదర్శనకు హాజరు కావాలని కోరారు. కౌలు రైతులకు భూయజమాని అంగీకారం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అధిక ధరలు అరికట్టడంతోపాటు ఆహార, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని మినహాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకుడు ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ గోడ పత్రిక ఆవిష్కరణ

చోడవరం రూరల్: కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరశిస్తూ వచ్చే నెల 5న ఢిల్లీలో వామ పక్షాల ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో చలో ఢిల్లీ గోడపత్రికలను ఆవిష్కరించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.బుచ్చిరాజమ్మ (చోడవరం), ఎస్. అమ్మాజీ (రావికమతం), పార్వతి, రాజులమ్మ (బుచ్చియ్యపేట), సత్యవతి, మాణిక్యం(కె.కోటపాడు) పాల్గొన్నారు.

ఉత్సాహంగా హైస్కూళ్ల వార్షికోత్సవం



మాట్లాడుతున్న స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాద్

రావికమతం: రావికమతం, కొత్తకోట హైస్కూళ్ల వార్షికోత్సవం, ఫేర్‌వెల్ వేడుకలు మంగళవారం అత్యంత సందడిగా జరిగాయి. విద్యార్థులు రోజంతా సందడిగా గడిపారు. సాంప్రదాయ దుస్తులు వేసుకుని ఉపాధ్యాయుల ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్కూల్ కమిటీ చైర్మన్ కొశిరెడ్డి ప్రసాద్, అడ్డూరి నానాజి, ప్రధానోపాధ్యాయులు డి.సత్యారావు, మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని పోగొట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

31న వారపు సంత వేలం



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: మండల పరిషత్ కార్యాలయంలో వారపు సంత వేలం పాట ఈనెల 31వ తేదీకి వాయిదా వేశామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ వేలం పాట ఈ నెల 27న నిర్వహించగా, కొంతమంది రింగ్ అయి రూ.53 వేలకు మించి పాడలేదన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం నాలుగేళ్లుగా చేపట్టిన వారపు సంత పాట మొత్తాన్ని లెక్కించగా, రూ. 58 వేలు దాటి పాట ఉండాలన్నారు. దానికి పైబడి వేలం వస్తేగానీ ఖరారు చేయడానికి వీలుకాదన్నారు. ఈ నిబంధనలు అనుసరించి నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనే వారికి ఏమైనా సందేహాలు ఉంటే ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగ

- భయంతో కూలీల పరుగులు



స్తంభం నుంచి తెగిపడిన విద్యుత్ తీగ

రోలుగుంట: కొమరవోలు గొల్లువారి పొలాల్లో మంగళవారం సాయంత్రం విద్యుత్ స్తంభం తీగ తెగి పడింది. దీంతో పవర్ సరఫరా ఉండడంతో మంటలు రేగాయి. సమీపంలో కూరగాయల పనులు చేస్తున్న కూలీలు ఆందోళనతో పరుగులు తీశారు. ఈ విషయాన్ని ఆ శాఖ మండల ఏఈ పద్మనాభంకు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీనిపై స్పందించిన ఏఈ వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి, సంఘటనా స్థలానికి సిబ్బందిని పంపించారు. తెగిపడి న తీగలను సరిచేశారు. రైతులు ఏమరుపాటుగా ఉంటే పెద్ద ప్రమాదమే వాటిల్లేదని స్థానికులు తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్: శ్రీరామ నవమి వేడుకలు గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉగాది పర్వదినం నుంచి రామాలయాల్లో నిత్య పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. కె.జె.పురం రామాలయంలో ఈ నెల 30న శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కళ్యాణం, అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. ఎం. కోటపాడు, ముకుందపురం, వంటర్ల పాలెం, వీరనారాయణం, పెంటయ్యపాలెం, వి.వి. అగ్రహారం, గాదిరాయి, జి. అగ్రహారం, చింతలూరు, కింతలి, జాలంపల్లి, తదితర గ్రామాల్లో నవమి వేడుకలు సందర్భంగా ఆలయాల వద్ద చలువ పందిర్లు వేశారు.